
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

బుధవారం 10 డిసెంబరు 2025



ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు మొదటి విడత జరిగే ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల వివరాలను మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రఘువరణ్, నోడల్ అధికారులు నరేష్, బి. నరేష్, భాస్కర్ ఉన్నారు.

'ఎన్నికలకు పటిష్ట భద్రత'

ఇబ్రహీంపట్నం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని టీఎస్ మాడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు చేప ట్టాలన్నారు. ఆమె వెంట సీఐ, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ లింగాపూర్ గ్రామ శివారులోని జిల్లా సరిహద్దు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది ప్రతి వాహన్ని క్షుణంగా తనిఖీ చేయాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తొలి విడత ప్రచారానికి తెర



- చివరి రోజు హోరాహోరీ ప్రచారం
- ప్రలోభాలకు తెర లేపుతున్న అభ్యర్థులు
- మహిళా, యువజన, కుల సంఘాల ఓట్లపై దృష్టి

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ఇన్ని రోజులు మోత మోగిన మైక్‌లు మంగళవారం సాయంత్రం మూగబోయాయి. గెలుపే ధ్యేయంగా పావులు కదుపుతున్న అభ్యర్థులు చివరి రోజు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాలు, ఇతర ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించారు. ఇదిలా ఉంటే జిల్లాలోని వైన్ షాపులు మూత పడ్డాయి. దీనికి తోడు తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే మండలాల్లో పలు ప్రత్యేక సెక్షన్ల అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని కోరుట్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రాజకీయం పతాక స్థాయికి చేరింది.

118 పంచాయతీలకు ఎన్నికలు

జిల్లాలో కోరుట్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 122 పంచాయతీలు, 1,172 వార్డు స్థానాలు ఉన్నాయి. ఏకగ్రీవమైన స్థానాలకు మినహాయించగా గురువారం తొలి విడతలో 118 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలు, వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, కథలాపూర్, బీమారం మండలాల్లో తొలి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో 461 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1,952 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగియడంతో చివరి రోజు విస్తృతంగా ప్రచారం చేశారు. తొలి విడతలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య హోరాహోరీగా పోరు సాగుతుండగా, ఈ మూడు పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు ఓట్లను రాబుట్టు కోవడంపై దృష్టి పెట్టారు. అలాగే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆయా గ్రామాల్లో వీలైనన్ని ఎక్కువ వార్డుల్లో ప్రచారం చేశారు.

ప్రత్యేక బృందాల తనిఖీలు

అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలతో పోటీ పడుతున్నారు. కుల, సంఘాలు, మహిళలు, యువ ఓటర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. మహిళా ఓటర్లే టార్గెట్‌గా పావులు కదుపుతున్నారు. అయితే ఎన్నికలు నిష్పక్షపాత వాతావరణంలో జరిగేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే అభ్యర్థులతో పాటు ఇతరులపై కూడా చర్యలు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అధికారులు అదనపు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి అంక్షలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రత్యేక బృందాలు తనిఖీలు ముమ్మరం చేశారు. తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యప్రసాద్ ప్రకటించారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ బృందాలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తొలి విడతలో 4 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

తొలి విడతలో 122 పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు జరుగుతుండగా మిగతా 8వ పేజీలో..

చల్‌గల్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

-సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్



ప్రచారం నిర్వహిస్తున్న జున్ను రాజేందర్, రాజేందర్ (ఇన్‌సెట్‌లో)

జగిత్యాలరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చల్‌గల్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్ ప్రచారంలో ఓటర్లకు హామీ ఇచ్చారు. గతంలో సర్పంచ్‌గా తన భార్య కవిత పనిచేసి అభివృద్ధి చేసి చూపించిందని, మళ్లీ గెలిస్తే చల్‌గల్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఉంగరం గుర్తుతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అన్ని వార్డుల్లో ప్రజల మద్దతు కూడగట్టడంతో రాజేందర్ విజయం సునాయాసమని అంటున్నారు. మంగళవారం గ్రామంలో వాడవాడలా తిరిగి ఇంటింటా ప్రచారం నిర్వహించారు ప్రజలు తనను ఆదరించి ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. గ్రామం మరింత అభివృద్ధి జరగాలంటే తమకు పట్టం కట్టాలని జున్ను రాజేందర్ పేర్కొన్నారు. రాజేందర్‌కు పలువురు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు. గెలుపు ధీమాతో రాజేందర్ మరింత ముందుకు తమదైన శైలిలో సాగుతున్నారు. ఈనెల 14న జరిగే ఎన్నికలో తనను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నాడు.

ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

బీర్‌పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సామల గంగాధర్



ఓటర్లకు కరపత్రాలను పంచుతున్న సర్పంచ్ అభ్యర్థి గంగాధర్

బీర్‌పూర్,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ గ్రామ ప్రజలు నన్ను ఆశీర్వధించి సర్పంచ్‌గా ఒక్క అవకాశాన్నిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీర్‌పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సామల గంగాధర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నన్నుఆధరించి లేడీస్ పర్సు గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపిస్తే నిస్వార్థంగా సేవలు చేసి గ్రామ ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. గ్రామంలో తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీలు, పరిసరాల పరిశుభ్రత, నాణ్యమైన విద్య లాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపి అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని ఓటర్లకు హామీ ఇచ్చారు. రైతులకు వ్యవసాయ మోటర్లు కాలిపోతే 25 శాతం తగ్గింపుతో వైండింగ్ చేయించడం, వడ్ల కొనుగోలు కేంద్రాలలో దోపిడీలను అరికట్టడం లాంటి మరెన్నో పనులు చేస్తానని ప్రచారాన్ని నిర్వహించారు. గతంలో ఏ పదవి లేకపోయినా గ్రామంలో అనేక పనులు చేశానన్నినరు. తన సేవలను గుర్తించి ఒక్కసారి లేడీస్ పర్సు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో సర్పంచ్‌గా గెలిపించాలని గంగాధర్ ఓటర్లను కోరారు.

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తా

బీర్‌పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సైండ్ల శ్రీనివాస్

బీర్‌పూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆశీర్వదించి సర్పంచ్‌గా గెలిపిస్తే మాజీ మంత్రి జీవన్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని బీర్‌పూర్ సర్పంచ్ అభ్యర్థి సైండ్ల శ్రీనివాస్ అన్నారు. సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న సైండ్ల శ్రీనివాస్ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను వినూత్న రీతిలో ఆకట్టుకుంటున్నారు. ఎన్నిక ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కట్టుబడి ఉంటానని ఓటర్లకు హామీ ఇస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం సర్పంచ్ అభ్యర్థి సైండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీర్‌పూర్ గ్రామ ప్రజలు ఒక్క సారి సర్పంచ్‌గా అవకాశాన్ని ఇచ్చి రిమోట్ గుర్తకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తనను గ్రామప్రజలు ఆదరించి సర్పంచ్‌గా భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామంలో బతుకమ్మ ఘాట్ ఏర్పాటుకు కృషి, ప్రతి వార్డును చీకటి రహిత వార్డుగా కృషి చేస్తానన్నారు. గ్రామంలో అవసరం ఉన్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు కృషి చేస్తానని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి మెరుగైన విద్య అందించేవిధంగా చూస్తానని అన్నారు. రిమోట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సైండ్ల శ్రీనివాస్ ఓటర్లను కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి సైండ్ల శ్రీనివాస్

మూడో విడతలో ఆరు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఆరు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 119 సర్పంచ్ స్థానాలకు, 1,088 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ పడుతూ 352 అభ్యర్థులు, వార్డు సభ్యునికి పోటీ పడుతూ 1,148 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఆరు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలోని పెగడపల్లి మండలం రాములపల్లి సర్పంచ్‌గా అమిరిశెట్టి లక్ష్మీనారాయణ, రాజారాంపల్లి సర్పంచ్‌గా ఇస్లావత్ రమేశ్ నాయక్, ఎండపల్లి మండలం కొండాపూర్ సర్పంచ్‌గా తాటిపర్తి రాజవ్వ, ధర్మపురి మండలం దోనూర్ సర్పంచ్‌గా దాసరి పురుషోత్తం, నర్సయ్యపల్లి సర్పంచ్‌గా పోతనశెట్టి నర్సయ్య, బోదరి నక్కల చెరువు గూడెం సర్పంచ్‌గా గోపు రాజన్నలు ఏకగ్రీవమయ్యారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 646 సర్పంచ్ అభ్యర్థులు, 2,811 వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లుగా అధికారులు ప్రకటించారు.

జగిత్యాల రూరల్ మండలం అంబారిపేట, కన్నాపూర్, రాయికల్ మండలం వస్తాపూర్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లను ఉప సంహరించుకోవడంతో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి సర్పంచ్‌గా మేడిపల్లి వనిత, కొడిమ్యాల మండలం చింతలపల్లి సర్పంచ్‌గా ఎలకపల్లి సుమలత, రాయికల్ మండలం వీరాపూర్ సర్పంచ్‌గా దిండిగల గంగు, సారంగాపూర్ మండలం నాయకపు గూడెం సర్పంచ్‌గా పుష్పనాథ్, సారంగాపూర్ మండలం రంగపేట వడ్డెర కాలనీ సర్పంచ్‌గా పల్లెపు మాదవి, సారంగాపూర్ మండలం బీంరెడ్డి గూడెం సర్పంచ్‌గా మేస్నేని ప్రమీళ, బీర్‌పూర్ మండలం గోండు గూడెం సర్పంచ్‌గా పురుక దీప కల్పనలు సింగిల్ నామినేషన్‌తో ఏకగ్రీవమయ్యారు. ఉప సంహరణ కార్యక్రమంలో పోటీ దారులు విరమించుకోవడంతో రాయికల్ మండలం వస్తాపూర్ సర్పంచ్‌గా గుడ్లవత్ తిరుపతి, జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట సర్పంచ్‌గా ఒడిసెల గంగాధర్ గౌడ్, జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ సర్పంచ్‌గా పొట్టవర్తిని సతీష్ కుమార్ ఏకగ్రీవమయ్యారు.

వేములవాడ బస్టాండ్ వద్ద ఒకరికి గుండెపోటు

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద మంగళవారం గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తికి పోలీసులు సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. నాంపల్లి గ్రామానికి చెందిన రమేష్(49) అనే వ్యక్తి తిప్పాపూర్ బస్టాండ్ వద్ద గుండెనొప్పితో మంగళవారం ఉదయం కుప్పకూలడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్, గంగరాజులు సీపీఆర్ చేసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించినప్పటికీ రమేష్ మృతి చెందాడు.

చలికాలంలో నారు మడి

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వరి సాగు చేసే రైతులు ఇప్పుడిప్పుడే నారుమడులు సిద్ధం చేసుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో వ్యవసాయ భూమి 16,92 ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉంది. 12,623 ఎకరాలో వరి సాగు, 854 ఎకరాల్లో మొక్కజొన్న పప్పు దాన్యాలు 50, ఇతర పంటలు 85 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం చలి కాలంలో వరి సాగు చేసే రైతులు నారు మడులను రక్షించుకునేందుకు పలు సూచనలు చేస్తున్నారు.

● మండెకట్టి విత్తనాలు వేయడం తప్పనిసరి

దమ్ము చేసే నారుమడిలో మండెకట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరి. రాత్రి ఉష్ణోగ్రతలు 12 సెల్సియస్ డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగదు, కొన్ని సార్లు ఎర్రబడి చనిపోతుంటాయి. రెండు గుంటల నారుమడికి వానాకాలం సూచించిన మోతాదులో రసాయనిక ఎరువులతో (నత్రజని, పొటాష్) పాటు రెండు క్వింటాళ్ల మాగిన కోళ్ల ఎరువు లేదా గొర్రె ఎరువు లేద వర్మీ కంపోస్టు వేసి కలియ దున్నాలి. భాస్వరాన్ని దుక్కిలో మోతాదు రెట్టింపు చేయాలి. చలి సమస్యను అధిగమించడానికి నారుమడిపై వెదురు కర్రలతో ఊతం ఇచ్చిపైన పలుచని పాలిథిన్ షీట్స్, లేదంటే ఖాళీ సంచులతో తయారు చేసి పట్టాను



గోపాల్‌పూర్‌లో నారుమడి

సాయంత్రం వేళల్లో కప్పి ఉంచాలి. మరుసటి రోజు ఉదయం తీసేయాలి. యాసంగిలో జింక్ లోప లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ లోపాన్ని సవరించాలి. నారు ఆరోగ్యంగా పెరగడానికి కిలో యూరియాకు రెండు గ్రాముల, కార్బండిజమ్ 25 శాతం ప్లస్ మాంకోజెబ్, 50 శాతం డబ్ల్యూఎస్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రి పూట నీరు నిండుగా ఉంచి తెల్లవారు జామున తొలగించి తాజాగా నీరు అందించాలని చెబుతున్నారు.

ఇరిగేషన్‌శాఖ రాష్ట్ర కన్వీనర్‌గా సంగెం లక్ష్మణ్‌రావు



లక్ష్మణ్‌రావు

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల రాష్ట్ర అడ్‌హక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లాకు చెందిన సంగెం లక్ష్మణ్‌రావు నియామకమయ్యారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మణ్‌రావును సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన నాయకుడు రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇది టీఎన్‌జీవోకు ఎంతో గర్వకారణమని అన్నారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కూడా గతంలో ఇరిగేషన్‌శాఖ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి ఎడ్ల అరవింద్‌రెడ్డి, టీఎన్‌జీవో కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్ పాల్గొన్నారు.

అక్కపల్లిలో మహిళ ఆత్మహత్య



లక్ష్మి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన మహిళ కొంపెల్లి లక్ష్మి(42) అనారోగ్య సమస్యలు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదు. మరో వైపు లక్ష్మి భర్త ముత్యం ఇటీవల కాలు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తండ్రి కొడుకులు ముత్యం, మహేశ్‌లు కలిసి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి బయలుదేరారు. 45 రోజుల కిందట వివాహమైన కూతురు రాధిక పుట్టింటి నుంచి అదే రోజు అత్తగారింటికి వెళ్లింది. ఆరోగ్య సమస్యలు.. కట్టుకున్న భర్త అనారోగ్యంతో బాధపడుతుండడం వల్ల మనస్తాపం చెందిన ఆమె ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడి గట్టింది. రాత్రయిన లక్ష్మి మాటలు వినిపించకపోవడంతో అనుమానం వచ్చిన సమీప బంధువులు ఇంటికి వెళ్లి చూశారు. తలుపులకు గడియ వేసుకున్న ఆమె ఎంత పిలిచినా పలకకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న భర్త, కొడుకు హైదరాబాద్ నుంచి హుటాహుటిన వచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతురాలికి భర్త ముత్యం,కొడుకు మహేశ్, కూతురు రాధికలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



రజిత (ఫైల్)

తంగళ్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో వివాహిత దీటి రజిత(31) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని అత్త గారింటి నుంచి రజిత ఐదు రోజుల క్రితం నేరెళ్ల లోని తన తల్లి గారింటికి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. మూడు సంవత్సరాల క్రితం భర్త సంతోష్ అనారోగ్యంతో మృతి చెందాడు, అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న రజితకు అనారోగ్యం తోడవడంతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఉరివేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి కూతురు సౌమ్య(11), శశాంక్(7) ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1,125 కిలో మీటర్లు బైక్‌పై ప్రయాణం

● మార్గమధ్యలో ప్రమాద బీమాపై అవగాహన



ప్రమాద బీమాపై అవగాహన కల్పిస్తున్న అచ్యుత్

జమ్మికుంట, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ సర్వీస్ ఏజెంట్ సమ్మెట అచ్యుత్ వారణాసి వరకు బైక్‌పై ప్రయాణం చేశాడు. 1,125కిలో మీటర్లు ప్రయాణం చేస్తూ మార్గం మధ్యలో లారీ, ఆటో, బస్సు, ట్రక్కు ఇలా వాహన డ్రైవర్ల రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల (పీఎంఎస్‌బీవై) ప్రమాద బీమా వస్తుందని అవగాహన కల్పించాడు. ఈ ప్రయాణానికి సహకరించిన బ్యాంక్ మేనేజర్, సిబ్బందికి అచ్యుత్ కృతజ్ఞతలు తెలిపారు.

యూనివర్సిటీలో రెండో రోజు విద్యార్థుల ఆందోళన

- పరీక్షలు వాయిదా వేసిన ఎస్‌యూ అధికారులు

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అకడమిక్ పరీక్షల తేదీలను వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు రెండో రోజు మంగళవారం ఆందోళనకు దిగారు. నెట్, సెట్ వంటి పరీక్షలు, సర్పంచ్ ఎన్నికల తేదీలు పీజీ పరీక్షలు ఉన్నందున యూనివర్సిటీ పరీక్షలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో అధికారులు, విద్యార్థులతో వీసీ ఉమేష్‌కుమార్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ పరీక్షలను జనవరి 5 నుంచి నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉపకులపతి, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బోయినపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌తో పాటు సుమన్ అనే ఇద్దరు వ్యక్తులు స్తంభంపల్లి గ్రామానికి మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, బోయినపల్లి పోలీసులు దాడులు నిర్వహించి 1,33,000 రూపాయల విలువ గల 253 లీటర్ల మద్యం పట్టుకున్నారు. మద్యంతో పాటు వాహనం సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

చందుర్తి: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం రామారావుపల్లి గ్రామనికి చెందిన పెద్దిగారి మల్లేష్ అనే వ్యక్తి తన కారులో అక్రమంగా 24 బీర్ సీసాలను తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలలో పట్టుబడినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం చందుర్తి ఇన్‌చార్జి ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె. రమేష్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కరీంనగర్ క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిలా కేంద్రంలోని ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. జిల్లాలో తొలి సారిగా రాష్ట్ర స్థాయి పోటీలు చేపట్టగా కరీంనగర్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. వయస్సు ప్రకారం గ్రూపులుగా విభజించి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్ నిలవగా... ఆ తర్వాత స్థానాల్లో రంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు నిలిచాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిని రవికుమార్, కొమ్ము కృష్ణతో పాటు ప్రముఖ వైద్యులు క్రాంతికుమార్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారథి, ఆదిత్య ఖండేష్కర్, బారే శ్రీధర్, రాజు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందచేసి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించి సత్తా చాటాలని అతిథులు ఆకాంక్షించారు. ఓడిపోయిన వారు నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో రాణించాలని సూచించారు. క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

వైద్య కళాశాలలకు పార్థివ దేహాలను దానం చేయాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలకు పార్థివ దేహాలను దానం చేయడానికి ముందుకు రావాలని సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ కోరారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన మందల రాజిరెడ్డి మృతి చెందగా వారి మనుమడు, మనుమరాలు వర్షిత్, వర్ష రాజిరెడ్డి పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ దేహదానాలు చేయడానికి ముందుకు రావాలని, దేహాలతో విద్యార్థులు అధ్యయనం చేస్తారని అన్నారు. సదాశయ ఫౌండేషన్ పార్థివ దేహాలను మెడికల్ కళాశాలకు చేర్చడంలో కీలక పోషిస్తున్నారని ఆయన అన్నారు. దేహదాత కుటుంబ సభ్యులను అభినందించారు. అనాటమి హెచ్‌ఓడీ శశికాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన, సదాశయ ఫౌండేషన్ ప్రచార క్యాదర్శి కేఎస్ వాసు, ప్రతినిధి దబ్బెట శంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రాజిరెడ్డి మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహిళ దారుణహత్య

వెల్గటూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో మంగళవారం రాత్రి అలివేలు (37) అనే మహిళ దారుణహత్యకు గురైంది. మండలి నరేష్ అనే వ్యక్తి అలివేలును రోకలిబండతో తలపై మోది హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్‌కు హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అలివేలుతో పరిచయం ఏర్పడింది. వారు అక్కడే సహజీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం స్తంభంపల్లికి వచ్చిన ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో నరేష్ కోపంతో రోకలి బండతో అలివేలు తలపై బలంగా మోదాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా నరేష్‌కు గతంలో వివాహం కాగా భార్య అతడికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డుపై గుర్తుతెలియని వృద్ధుడు(70) మంగళవారం మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు టూటౌన్ సీఐ ఫోన్. 8712670762, పోలీస్‌స్టేషన్ ఫోన్. 83319 40593, హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబు 8712574215లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అర్జీదారు వద్దకే వచ్చి భూమి రిజిస్ట్రేషన్



అర్జీదారు వద్ద వివరాలు తీసుకుంటున్న తహసీల్దార్ నాగార్జున

రాయికల్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగార్జున అర్జీదారు వద్దకే వచ్చి భూమి రిజిస్ట్రేషన్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన కొడిమ్యాల ఇందమ్మ తన భూమి విక్రయించారు. భూమి విక్రయ రిజిస్ట్రేషన్ కోసం కుటుంబ సభ్యులు ఆమెను తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం వరకు ఆటోలో తీసుకువచ్చారు. అర్జీదారు నడవలేని పరిస్థితిలో ఉందని తెలుసుకున్న తహసీల్దార్ మానవత్వంతో స్పందించి కార్యాలయం బయట ఆటోలో ఉన్న ఆమె వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సమద్ నవాబ్ హఠాన్మరణం



సమద్ నవాబ్(ఫైల్)

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు పరిరక్షణ కమిటీ చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ సమద్‌నవాబ్(60) మంగళవారం సాయంత్రం మరణించారు. సోమవారం ఉదయం ఇంటి వద్ద ఉండగా ఒక్క సారిగా అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.,

ఉప సర్పంచి ఎన్నిక ఇలా


కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప సర్పంచి పదవి కోసం ఇద్దరు. ముగ్గురు పోటీ పడితే సమావేశానికి హాజరైన సభ్యులు తమ చేతులను పైకి ఎత్తడం ద్వారా ఫలితాన్ని నిర్ణయిస్తారు. ఉప సర్పంచి ఎన్నిక కోసం వార్డు సభ్యుల్లో ఒకరి పేరును మరో వార్డు సభ్యుడు లేక సభ్యురాలు ప్రతిపాదించాలి. ఇంకో సభ్యుడు లేక సభ్యురాలు బలపరచాలి. ఒకరు మాత్రమే నామినేట్ అయితే సదరు అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటిస్తారు. ఈ ఎన్నికలో సర్పంచి కూడా ఓటేసేందుకు అర్హత కలిగి ఉంటారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సమానంగా ఓట్లు వస్తే సభ్యుల సమక్షంలోనే లాటరీ ద్వారా డ్రా నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

పంచాయతీ ఎన్నికలకు భద్రత కట్టుదిట్టం

● మద్యం, నగదు సీజ్ ● కోడ్ ఉల్లంఘనపై 6 కేసులు ● కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన ఎన్నికల బందోబస్తు వివరాలను మీడియాకు వెల్లడించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిని సున్నితమైన/సమస్యాత్మకమైన కేంద్రాలుగా విభజించామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఒక స్టాటిక్ పోలీసు పార్టీ, ప్రతీ మార్గంలో(రూట్) ఒక రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతీ మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించినట్లు చెప్పారు. ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తి స్థాయి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారన్నారు. కమిషనరేట్ పరిధిని మొత్తం 104 క్లస్టర్‌లుగా విభజించామని, ఎన్నికలు ప్రారంభం నాటి నుంచి ఈ క్లస్టర్లలో ప్రివెంటివ్ పెట్రోలింగ్ నిర్వహించడానికి సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌తోపాటు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను అదనంగా రాత్రి గస్తీ కోసం కేటాయించామన్నారు.

గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ప్రలోభాలకు, భయ భ్రాంతులకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఇప్పటివరకు 132 అక్రమ మద్యం కేసులు నమోదు చేశామని, 10.71 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఆరు కేసులు నమోదు చేశామని, వాహన తనిఖీల్లో లక్ష రూపాయల నగదు పట్టుకున్నామని అన్నారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నామని, వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని వెల్లడించారు.



● చర్చిలో ప్రచారం.. సర్పంచ్ అభ్యర్థిపై కేసు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మతపరమైన ప్రదేశంలో ప్రచారం నిర్వహించినందుకు గంగాధర గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి చిరుత మంగ (భర్త రమేష్) చర్చిలో సమావేశం నిర్వహించారు. తమ గుర్తు చూపిస్తూ ఓట్లు అభ్యర్థించడంపై కేసు నమోదు చేశారు.

● వార్డు అభ్యర్థిపై..

ఎన్నికల ప్రచారం కోసం ముద్రించిన కరపత్రంలో, ఒక వ్యక్తి అనుమతి లేకుండా అతడి పేరును ప్రచురణ కర్తగా ముద్రించినందుకు వార్డు అభ్యర్థిపై కేసు నమోదైంది. రామడుగు గ్రామంలో 8వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న అభ్యర్థి సైళ్ల బీరయ్య ఎన్నికల కరపత్రాల్లో అనుమతి లేకుండా తన పేరును ప్రచురించి, గ్రామంలో పంపిణీ చేసినట్లు పూరెళ్ల మధుకర్ ఫిర్యాదు చేశాడు.

● చొప్పదండి మండలంలోని ఆర్నకొండ శివారులో సోమవారం పోలీసుల తనిఖీల్లో తమ్మిడి కనకరాజు, గోల్కొండ మధుకర్ మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్యంతో పట్టుబడిన కనకరాజు భార్య ఆర్నకొండ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఎన్నికల్లో గెలవడం కోసం ఓటర్లకు పంపిణీ చేయడానికి మద్యాన్ని తరలిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. రూ.49,920 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● మానకొండూరు మండలం చెంజర్లలో సర్పంచ్ అభ్యర్థి గోల్లేన కనుకవ్వ సీరియల్ నంబర్‌ను తప్పుగా ముద్రించిన నకిలీ నమూనా బ్యాలట్ పేపర్లు పంపిణీ చేసి, ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినట్లు కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న గడ్డి రేణుకతో పాటు గడ్డి గణేష్, ఆదిత్య ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై కేసు నమోదు చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లో మద్యం పంపిణీ చేస్తున్న వార్డు అభ్యర్థి జడా అంజయ్య, అతడి స్నేహితుడు చిట్కూరి మల్లేష్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదైంది.

ధర్మపురి నరసింహుని సన్నిధిలో జీయర్‌స్వామి పూజలు



జీయర్‌స్వామికి ప్రసాదాలు అందిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి మంగళవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు జరిపారు. అంతకు ముందు యమధర్మరాజు ఆలయం వద్ద స్వామీజీ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన స్వామీజీకి శేషవస్త్రం, పండ్లు, ఫలాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు
స్వయం ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

జమ్మికుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ల పథకం ముఖ్య ఉద్దేశ్యమని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ల పథకంపైన నాబార్డ్ ఆధ్వర్యంలో శిక్షణ నైపుణ్య కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లు, వ్యవసాయ సంబంధిత కోర్సులు చేసిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. నాబార్డ్ డిడియం జైప్రకాష్ మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన నోడల్ శిక్షణ సంస్థల ద్వారా 45రోజుల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ వ్యాపార యూనిట్లు స్థాపించడానికి బ్యాం కుల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికా రిణి భాగ్యలక్ష్మి, కెవికె ప్రధానకార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోయిని కుంట గ్రామానికి ఓ వ్యక్తి మద్యాన్ని వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్ నుంచి మోయినికుంట గ్రామానికి చెందిన పల్లాటి కుమార్ అనే వ్యక్తి 167 మద్యం బాటిళ్లను మోయినికుంటకు ఓ కారులో తరలిస్తుండగా పట్టుకొని కారును, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.



- పైసా ఖర్చు లేకుండా అభ్యర్థుల ప్రచార హోరు
- ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు
- ప్రచార ఫొటోలు... వీడియోలు..

ముత్తారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పోటీదారులు ప్రచారాన్ని ముమ్మరంచేశారు. రోడ్ల వెంట వెళ్లే వారిని సైతం పలకరిస్తూ వారికి ఏ అవసరం ఉన్న తీరుస్తూ అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ అవకాశం దొరికిన తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది సామాజిక మాధ్యమాలే వేదికగా ఎన్నికల ప్రచార హోరు ఊపందుకుంటుంది.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు అందరికీ ఉంటున్నాయి. ప్రపంచంలో ఏ మూలన ఏం జరుగుతుందో క్షణాల్లో అరచేతిలో ప్రత్యక్షమవుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు మూస ధోరణి ప్రచార విధానాలకు స్వస్తి పలుకుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి అరచేతిలోనే మొబైల్ ఆయుధాన్ని వాడుతున్నారు. సామాజిక మాధ్యమాలపై పట్టు ఉన్న నాయకులు తామే స్వయంగా ఖాతాలను నిర్వహిస్తుండగా, వినియోగించుకుంటు మరికొందరు నాయకుల ఖాతాలను ప్రధాన అనుచరులు నిర్వహిస్తున్నారు. చిత్రాలు, వీడియోలు, ప్రచారం ప్రత్యర్థులపై విమర్శలు, కౌంటర్లు ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

● ప్రత్యేకంగా వాట్సాప్ గూపులు



సర్పంచి ఎన్నికల వేళ అభ్యర్థుల పేరుతో ప్రత్యే కంగా మరికొన్ని గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా గ్రూపుల్లో తమ ప్రచారాలు, గ్రామాభి వృద్ధిపై ఓటర్ల అభిప్రాయాలు, నేతల సందేశాలు, హామీలు, రోజువారి కార్యక్రమాలను పోస్టు చేస్తు న్నారు. ప్రత్యర్థులు పెట్టే పోస్టులకు సమాధానంగా మరికొన్ని పోస్టులు పెడుతున్నారు. అభ్యర్థులతోపాటు వారి మద్దతుదారులు, కుటుంబ సభ్యులు వీటినే ప్ర చార అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళల పేరుతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటుచేసి గుర్తులను పెడుతూ గుర్తుంచుకోండి అంటూ ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల ఫొటోలు, గుర్తులతో ప్రత్యేక ఆకృతులను రూపొందించి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నారు. తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. మొత్తంగా అభ్యర్థులు మామూలు ప్రచారం కంటే సోషల్ మీడియా ద్వారానే ప్రచారం ముమ్మరం చేసుకుంటున్నారు.

● గ్రూపుల్లో చర్చోపచర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. పార్టీలకు సంబంధించిన వివిధ గ్రూపులతోపాటు గ్రామాలు, కుల సంఘాలు, యువజన సంఘాల పేర్లతో ఉన్న గ్రూపుల్లో ఎక్కడ చూసిన ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే దర్శనమిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, బరిలో ఉన్న, అభ్యర్థులకు అనుకూలంగా, ప్రతికూలంగా కామెంట్లు పెడుతు న్నారు. పార్టీల మద్దతు ఆశించి భంగపడ్డవారు, వారి అనుచరులు, అవకాశం దక్కిన వారు, వారి మద్దతుదారుల పోటాపోటీగా సోషల్ వార్ కొనసాగుతోంది.

వేములవాడ ఆలయ హుండీ ఆదాయం రూ.1.29కోట్లు

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ భీమేశ్వరాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ 14 రోజుల హుండీ ఆదాయం కోటి 29 లక్షల 27 వేల 470 రూపాయలు, 60.5 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో రమాదేవి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

అరుణాచలం, రామేశ్వరం ప్రత్యేక సర్వీసులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. ఈ నెల 15న గోదావరిఖని బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 1గంటకు బయలు దేరి కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పళని, పాతాళ శంభు, మధురై, రామేశ్వరం విష్ణుకంచి, శివకంచి, జోగులాంబ పదియాత్రలు పూర్తి చేసుకుని, అనంతరం 22న గోదావరిఖని బస్టాండ్‌కు చేరుకుటుందని తెలిపారు. ఈ సర్వీస్ పెద్దలకు రూ. 8000, పిల్లలకు రూ.6000 చార్జీలు నిర్ణయించినట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 7382847596, 7013504982 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాటు సారా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బంజేరు గ్రామ పంచాయతీ పరిధిలోని కోక్యాతండాలోని సారా స్థావరాలపై ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 2 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులైన గుగులోతు ప్రమీల, గుగులోతు చంకు, గుగులోతు రాంజీ, గుగులోతు కంసాలిలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

● భారత్‌కు బంగారు పతకం సాధించిన అర్చన



చాంపియన్‌షిప్ కప్‌తో అర్చన

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆడబిడ్డ మిట్టపెల్లి అర్చన రాణించింది. ఫైనల్స్‌లో విజయం సాధించి బంగారు పతకం సాధించడంలో అర్చన కీలక పాత్ర పోషించింది. భారత్ విజయంలో సారథిగా నిలిచిన అర్చనకు మంగళవారం జిల్లాలోని క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో శ్రీలంకలో జరిగిన మొదటి సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలో భారత జట్టుకు అర్చన ప్రాతినిధ్యం వహించింది. ఫైనల్స్‌లో ఆతిధ్య దేశం శ్రీలంక జట్టుపై పోరాడి విజయం సాధించడంలో అర్చన కీలకపాత్ర పోషించింది. ప్రపంచ పారా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు నిర్మలరావత్ చేతుల మీదుగా విజేత భారత్ జట్టు సభ్యులు చాంపియన్‌షిప్ కప్‌తో పాటు బంగారు పతకాలు(మెడల్స్)ను అందుకున్నవారిలో అర్చన ఉంది. క్రీడలలో అంగవైకల్యం అడ్డుకాదని మహిళ జట్టు సభ్యులు నిరూపించి ఆదర్శంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటకు చెందిన మిట్టపల్లి అర్చన చిన్నతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎడమ చెయ్యి కాలిపోయింది. అయినా ఆత్మ విశ్వాసంతో ఒకవైపు విద్యాభ్యాస్యం చేస్తూనే క్రీడలపై ఉన్న మక్కువతో మరోవైపు త్రోబాల్ ఆడుతూ మొక్కవోని దీక్షతో ముందుకు సాగింది. ఎంఏ, బీఈడీతో పాటు ఎంఎస్సీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగం రాకున్నా నిరత్సాహపడలేదు. అవుట్ సోర్సింగ్‌లో చిన్న ఉద్యోగం చేస్తూ సొంత ఇల్లు లేకున్నా ఆర్థిక ఇబ్బందులున్న ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ త్రోబాల్ ప్రాక్టీస్ చేసింది. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనకు కనబరుస్తూ ఎన్నో పతకాలను సాధించిన అర్చన జట్టు సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపి యన్‌షిప్ పోటీల్లో శ్రీలంక జట్టుపై గెలిచింది.

తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో
'కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ'



కరీంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులు తయారు చేసిన బుద్ధుడి ప్రతిమలు కనువిందు చేశాయి.పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుద్ధుడి ప్రతిమను అందజేశారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ముందురోజు భక్తులు భీమేశ్వర స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేకంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

ఇల్లంతకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి కీసరి సుజాత కట్టిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంపై మంగళవారం మండలస్థాయి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని కోరారు.

శాతవాహన యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



వివిధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. యూనివర్సిటీ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమాకాంత్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపునకు ప్రయత్నించాలన్నారు. యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకొని అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విజేతలుగా నిలిచి శాతవాహన యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు, ఫుట్‌బాల్ కోచ్‌లు పాల్గొన్నారు.

ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడే ఉద్యోగులపై చర్యలు తీసుకునేలా ప్రజలు ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ అవినీతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఏసీబీ అడిషనల్ డీజీ చారుసింహా రాష్ట్రంలో అవినీతి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేయడం కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టడాన్ని తాము హర్షిస్తున్నామని అన్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు ఫోన్ నెంబర్లను ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద, పట్టణ, గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి ఉద్యోగులు కొన్ని నెలలకు మళ్లీ విధుల్లోకి చేరుతున్నారని ఇది బాధాకరమని అన్నారు. ఒకసారి ఏసీబీకి చిక్కిన అవినీతి ఉద్యోగులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించే చట్టాలను ప్రభుత్వాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు చిప్ప దేవదాస్, ఉపాధ్యక్షులు వేముల పోశెట్టి, సభ్యులు చీకోటి అనిల్‌కుమార్, దేవులపల్లి శ్రీరాములు, కుసుమ గణేష్ ఉన్నారు.

పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద రూ.3 లక్షల నగదు పట్టివేత

గంభీరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ. 3 లక్షల నగదును పట్టుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌లు పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 3 లక్షల నగదు పట్టుబడింది. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళుతున్న కారును సోదా చేయగా, 3 లక్షల నగదు లభ్యమైంది. దొరికిన రూ. 3 లక్షల నగదును సీజ్ చేశామని పోలీస్‌లు తెలిపారు.

రూ.7,450 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లు చేపడుతున్న వ్యాపారులు

జమ్మికుంట, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 47మంది రైతులు 447క్వింటాళ్ల విడి పత్తి విక్రయా నికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

గణేశ్‌నగర్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ ఎల్ఎండీ క్యాంపస్‌లో గల ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా కే శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతి వల్ల కలిగే నష్టాలను వివరించారు. పారదర్శక, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణకుమార్, పున్నం చందర్, కళాశాల విభాగాధిపతి జీయల్ అర్చన, అధ్యాపకులు డా బి భాగ్యలక్ష్మి, డా కే సునీత, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యల నిలయాలుగా మారిన సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలు, ఫుట్‌బాల్ ఆటల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై లేదని ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం చేనేత వస్త్ర వ్యాపారం సంఘం భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాల్గవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్థానిక కార్మిక భవనం నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా సంఘం భవనం వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం భవనం ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షుడు రాకేష్ ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన మణికంఠరెడ్డి మాట్లాడారు. 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం విద్యార్థులను విస్మరించిందని దేశంలోని విద్యా వ్యవస్థను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేయడానికి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పాఠ్యాంశాలలో మతపరమైన అంశాలను చేరుస్తూ చరిత్రను తొలగించే ప్రయత్నాలను విద్యార్థులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విభజన హామీలలో తెలంగాణకు రావాల్సిన కేటాయింపులను తీసుకురావడంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విఫలమయ్యారన్నారు. తెలంగాణలో రెండేళ్ల ప్రజాపాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేక పోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బాలికల విభాగం కో కన్వీనర్ కండె విజేత, జిల్లా కార్యదర్శి మంద అనిల్, నాయకులు పెండల ఆదిత్య, ముద్రకోల శశికుమార్, బండారి చందు, బండి ప్రణయ్, వంశీ ఉన్నారు.

అటవీ అధికారిపై దాడి.. కేసు నమోదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు9(ఆంధ్ర జ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎఫ్‌బీవో బోనాల శ్రీకాంత్‌పై దాడి చేసిన సంఘటనలో అదే తండా వాసి తేజావత్ మోహన్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. తండా శివారులోని అటవీ భూమిలోకి మోహన్ అక్రమంగా ప్రవేశించడంతో పాటు బోరు బావి తవ్విస్తున్నాడనే సమాచారంతో ఎఫ్‌బీవో శ్రీకాంత్ అక్కడకు చేరుకున్నారని పేర్కొన్నారు. అటవీ భూమిలో బోరు ఎందుకు వేయిస్తున్నావని ప్రశ్నిస్తే దాడికి దిగాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు. అటవీభూమి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అన్నారు.

గ్రామ సమస్యలను పరిష్కరిస్తా

-చల్‌గల్ సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్



చల్‌గల్‌లో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్

జగిత్యాలరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తలొంచి సమస్య విని వాటిని పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్ అన్నారు. మంగళవారం చల్గల్ గ్రామంలో ఆయన ఆయా వార్డుల్లో ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తన భార్య కవిత సర్పంచ్‌గా పనిచేసిన కాలంలోనే గ్రామంలో మెజార్టీ అభివృద్ధి పనులు చేయించానని తెలిపారు. నిత్యం ప్రజలకు అంటుబాటులో ఉంటూ.. ప్రజా సేవనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాజేందర్ విజయం ఖాయమని ప్రజలు అంటున్నారు. తన గురించి ప్రజలకు తెలుసునని, మరోసారి అవకాశం కల్పించి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో కీలకపాత్ర పోషించానని, సామాజిక సేవలో భాగంగా ప్రజలకు పలు సేవాకార్యక్రమాలను నిర్వహించానని తెలిపారు. ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జున్ను రాజేందర్ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉందని, దీంతో గ్రామానికి అధికమొత్తంలో నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

మహిళలు, యువతకు ఉపాధి కల్పనకు కృషి

-పోతారం సర్పంచ్ అభ్యర్థి ధర్మపురి స్వప్నజలందర్

కథలాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత, యువతకు ఉపాధి గ్రామంలోనే లభించేలా పక్కా ప్రణాళికతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని పోతారం సర్పంచ్ అభ్యర్థి ధర్మపురి స్వప్నజలందర్ పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్ మండలంలోని పోతారంలో ఇంటింటి ప్రచారం మహిళలతో కలిసి నిర్వహించారు. గ్రామంలో తన భర్త గత ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేశారని అక్కడక్కడ మురికికాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేయాల్సి ఉందన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచడం, ప్లాస్టిక్ నిషేధం, జూట్ బ్యాగుల తయారీ, పసుపు తయారు చేసే చిన్న తరహా పరిశ్రమలను స్థానిక మహిళలతో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో గ్రంథాలయం ఏర్పాటు చేసి గ్రామంలోని యువతకు పఠనాసక్తి పెంచి పోటీ పరీక్షలకు హాజరయ్యేలా చూస్తా, పాఠశాలను అభివృద్ధి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి గ్రామస్థుల సహకారం తీసుకుంటా. శరీర దారుఢ్యం పెంచడానికి గ్రామ శివారులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన భర్త చేసిన అభివృద్ధి పనుల స్ఫూర్తితో ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారీతో గెలిపించాలని స్వప్నజలందర్ కోరారు.



పోతారంలో ఓటు అభ్యర్థిస్తున్న ధర్మపురి స్వప్నజలందర్

గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తా

-తిమ్మాపూర్ సర్పంచ్ అభ్యర్థి బాస శ్రావణ్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాస శ్రావణ్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని తనకు సర్పంచ్‌గా ఒక్క అవకాశం కల్పించాలని సర్పంచ్ అభ్యర్థి బాస శ్రావణ్ గ్రామ ప్రజలకు విన్నవించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు యువకులు, మహిళలు, గ్రామస్తులకు ఓటు హక్కు విలువను తెలుపుతూ గ్రామంలో అభివృద్ధి జరగాలంటే తనలాంటి చదువుకున్న యువతకు అవకాశం కల్పించాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు కావాలన్నా తన ఆధ్వర్యంలో చేసి చూపిస్తానని తనకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో తనపై గ్రామస్తులకు సానుకూల వాతావరణం ఉందని, తన గెలుపు ఖాయంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. తనకు ఎన్నికల అధికారులు కేటాయించిన కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరినట్లు తెలిపారు. తన గెలుపునకు యువత కూడా ఆ దిశగా ఆలోచనలు సాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తన గెలుపు వల్ల గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతోపాటు పలు సమస్యలను తీర్చేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన ఉద్ఘాటించారు.



తొలి విడత ప్రచారానికి తెర

(ఐదో పేజీ తరువాయి)

4 పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 118 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, 461 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 1,172 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, కథలాపూర్ మండలం రాజారాం తండా, మేడిపల్లి మండలం విలయతాబాద్‌లో ఒక్కో వార్డు స్థానానికి నామినేషన్లు దాఖలు కాలేదు. 349 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 821 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా 1,952 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

మద్యం దుకాణాలు బంద్..

ఎన్నికలకు మరొక్క రోజే గడువు ఉండటంతో అభ్యర్థులు ఓట్లు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. అన్ని అస్త్రాలు ప్రయోగిస్తూ వస్తున్న అభ్యర్థులు ఇప్పుడు ప్రలోభాలకు తెర లేపబోతున్నారు. పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టిన అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లకు పెద్ద మొత్తంలో డబ్బులు అప్పగిస్తున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల ఏజెంట్లతో ప్రధాన పార్టీల అభ్యర్థులు మాట్లాడి డబ్బులు సమకూర్చుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా మహిళా సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలపై దృష్టి కేంద్రీకరించి, వారికి పెద్దఎత్తున నగదు పంపిణీ చేసే పనిలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. ఇలా గెలుపే ధ్యేయంగా అభ్యర్థులు ఇన్నాళ్లు ప్రచారం చేయగా, ఇప్పుడు ప్రలోభాలకు తెర లేపబోతున్నారు. జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే మండలాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికలు ముగిసేవరకు మద్యం షాపులు, కల్లు దుకాణాలను మూసి ఉంచుతున్నారు.

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

-కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ విధానంలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద తెలిపారు. మంగళవారం ఎన్నికల నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారిగా రాండమైజేషన్‌లో పోలింగ్ అధికారులు 1406 పిఓ మరియు ప్రిసైడింగ్ అధికారులు 2005 ఓపిఓలను మొదటి విడత ఎన్నికలకు కేటాయించి నట్లు తెలిపారు. మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్‌ల తరలింపు, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి రఘువరణ్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన సీఈవో

రాయికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను మంగళవారం జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, పీఆర్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ల వినియోగం

కథలాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 54 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ఈ బ్యాలెట్ పేపర్లను స్టేజ్ 2 ఆఫీసర్లకు అందజేసి ఎన్నికల ఫలితాల సమయంలో లెక్కిస్తారని చెప్పారు.

నిబంధనలు పాటించాలి

బీర్‌పూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నిబంధనలు పాటించాలని డీఈవో రాము అన్నారు. మంశవారం మండలంలోని జెడ్పి హెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన ట్రైనింగ్ కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, శిక్షణ ట్రైనింగ్ మండల విద్యాధికారి నాగబూషణం పాల్గొన్నారు.

కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

-ఘనంగా తెలంగాణ విజయ్ దివస్



తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు చేసిన ఉద్యమం భావితరానికి ఆదర్శనీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అభిప్రాయపడ్డారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ మాజీ కౌన్సిలర్ బట్టు సునిల్ నాయకులు గెల్లె గంగాధర్, జాల వినోద్, మురళి, అతిక్, పహీం, అన్వర్, సంతోష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●**జగిత్యాల టౌన్:** తెలంగాణ తల్లిని మార్చిన దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి అని మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. జగిత్యాల పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దావా వసంత సురేష్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సర్కిల్‌లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజి కౌన్సిలర్‌లు దేవేందర్ నాయక్, సమీండ్ల శ్రీనివాస్, ఆవారి శివకేసరి బాబు, శ్రీరాముల సత్యానారయణ, శ్రీధర్‌రెడ్డి, మహెందర్, పట్టణ, మండల అధ్యక్షులు, నాయకులు కుమార్, ఆనంద్‌రావు, గంగాధర్, తేలు రాజు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాబిషేకం జరిపి పూల మాల వేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మాజీ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు క్షీరాబిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు డిజిటల్ వాయిలెన్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా గైనకాలజికల్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ సి. పద్మిని కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలపై డిజిటల్ వాయిలెన్స్ అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గైనకాలజికల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గూడూరి శ్రీలత, కోశాధికారి డాక్టర్ ఓడ్నాల రజిత, డాక్టర్ సంగీత రాణి, శ్రీలత పాల్గొన్నారు.

వైద్యశాఖ అడ్వయిజరీ కమిటీ సమావేశం

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖ అడ్వజరీ కమిటీ సమావేశం మంగళవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్‌లకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసికూటర్ రామకృష్ణ రావు, సామాజిక కార్యకర్తలు రామచంద్రం, బొబ్బటి కరుణ, జిల్లా ఉప వైద్యాధికారులు శ్రీనివాస్, మున్ను జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమాల్లో టీఆర్‌టీఎఫ్ కీలక పాత్ర

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమాల్లో టీఆర్‌టీఎఫ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఆర్‌టీఎఫ్ 80 వసంతాల అభ్యుదయ కరపత్రాన్ని మంగళవారం ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటుకం రమేష్, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గజభింకార్ గోవర్ధన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి భీమయ్య, ధర్మపురి మండల అధ్యక్షులు బండారి సతీష్ పాల్గొన్నారు.

భూ సేకరణ గ్రామ సభ

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా భూ సేకరణ కోసం మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. దేవస్థానం అభివృద్ధి కోసం అదనంగా సేకరిస్తున్న భూమి 2-07 గుంటల ఆవశ్యకత గురించి గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో భూ సేకరణ అధికారి, జగిత్యాల ఆర్డీవో మదుసూధన్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మపురి మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, భూమి యజమానులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో ప్రజాజీవనం అస్తవ్యస్తం'

కోరుట్ల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరోపించారు. పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటర్లను బెదిరించి ఓట్లు వేయించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. గ్రామ పంచాయితీలలో ట్రాక్టర్లలో డీజిల్ పోసేందుకు నిదులు లేవని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ నాయకులు పహీం, అతిక్, అన్వర్, వినోద్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ పర్వం

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగిసింది. మూడో విడతలో సర్పంచ్ స్థానాలకు 461 మంది అభ్యర్థులు, వార్డు స్థానాలకు 2,369 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మూడో విడుత 119 స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఇందులో ఆరు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 114 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా 1,088 వార్డు స్థానాలకు గాను 228వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవయ్యాయి. మిగిలిన 660 వార్డు సభ్యుల స్థానాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు గాను 2019 మంది అభ్యర్ధులు పోటీపడుతున్నారు

●**ధర్మపురి:** ధర్మపురి మండలంలోని ఎనిమిది క్లస్టర్ల పరిధిలో గల 25 గ్రామ పంచాయితీ, 224 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన 21 మంది సర్పంచ్ అభ్యర్థులు, 65మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. నామి నేషన్ల ఉపసంహరణ గడువు పూర్తి అయ్యే వరకు 88 మంది సర్పంచ్ అభ్యర్థులు, 409 మంది వార్డు సభ్యుల అభ్య ర్థులు పోటీలో ఉన్నారు. ముగ్గురు సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో నర్సయ్య పల్లె సర్పంచ్‌గా పోతంశెట్టి నర్సయ్య, బోదరినక్కల చెరువు గూడెం సర్పంచ్‌గా గోపు రాజన్న, దొనూర్ సర్పంచ్‌గా దాసరి పురుషోత్తం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జగిత్యాల జిల్లా ఎన్నికల సహాయ అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్‌కుమార్ తెలిపారు.

●**వెల్గటూర్:** వెల్గటూర్ మండలంలోని 19 సర్పంచ్ స్థానాలకు గాను 74 మంది సర్పంచ్ అభ్యర్థులు, 168 వార్డు స్థానాలకు 344 మంది వార్డు సభ్యులు బరిలో నిలిచినట్లు ఎంపీడీవో వెంకటప్రసాద్ తెలిపారు. సర్పంచ్ స్థానాలకు మొత్తం 86 మంది నామినేషన్లు చెల్లుబాటు కాగా మంగళవారం 12 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీనితో 19 సర్పంచ్ స్థానాలకు 74 మంది పోటీ పడబోతున్నారు. 168 వార్డు స్థానాలకు నామినేషన్ల స్క్రుటినీ సమయంలో 32 వార్డు స్థానాలకు ఒకటే నామినేషన్ రావడంతో 32 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు. మంగళవారం 12 మంది వార్డు సభ్యులు నామినేషన్లు ఉప సంహరించుకోవడంతో మరో 6 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీనితో మొత్తం 38 వార్డు సభ్యులు ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటిం చారు. మిగిలిన 130 వార్డు స్థానాలకు 344 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో సర్పంచ్ ఎన్నికల బరిలో 91 మంది మిగిలారు. నామినేషన్ల ఉపహరణ అనంతరం మండలంలోని 23 గ్రామాలకు గాను రాములపల్లి సర్పంచ్‌గా అమిరిశెట్టి లక్ష్మినారాయణ, రాజారాంపల్లి సర్పంచ్‌గా ఇస్లావత్ రమేష్ నాయక్ లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగిలిన 21 గ్రామ పంచాయతీలకు 91 మంది ఎన్నికల బరిలో మిగిలారు. 216 వార్డు స్థానాలకు గాను 52 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా 164 వార్డు స్థానాలకు గాను 480 మంది పోటీలో ఉన్నట్లు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు.

●**గొల్లపల్లి:** గొల్లపల్లి మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవుల కోసం మొత్తం 99 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారి రవీందర్‌రావు తెలిపారు. మొత్తం 128 మంది నామినేషన్లు వేయగా రెండు సరైన పత్రాలు సమర్పించక పోవడంతో తిరస్కరించారు. కాగా 27 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మండలంలో 246 వార్డు స్థానాలకు గాను 33 వార్డు స్థానాలు ఏకగ్రీవమవగా మిగితా 213 స్థానాలకు 529 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మల్యాల, డిశంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మత్తులు జరుగనున్న దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడునున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు.

బుధవారం ఉదయం 8.30గంటల నుంచి మద్యాహ్నం 12గంటల వరకు మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపేట, గుడిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అన్నారు. వినియోగ దారులు, రైతులు సహకరించాలని కోరారు.

'సమస్యల పరిష్కారమే లక్ష్యం'

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ లక్ష్యమని సంఘ ప్రాంతీయ అధ్యక్షుడు గొల్లె చేర్యాలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కంపెని నాయకులు రఘునందన్, సత్తిరెడ్డి, అరిఫొద్దీన్, ఎస్‌వి రమణారావు, శేషగిరిరావుతో పాటు జగిత్యాల సర్కిల్ నూతన కార్యవర్గం, జగిత్యాల, మెట్‌పల్లి డివిజన్ మరియు సిటిసర్కిల్ కార్య వర్గాలను 2025-28 కాలానికి ఎన్నుకున్నట్లు తెలిపారు.

●ప్రాంతీయ అధ్యక్షునిగా గొల్లె చేర్యాలు, ప్రాంతీయ కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్యామ్, ప్రాంతీయ కార్యదర్శిగా అజీజ్ అహ్మద్, అదనపు కార్యదర్శిగా కేవి రమణయ్య, జగిత్యాల డివిజన్ అధ్యక్షునిగా రవిశంకర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా మధుసూదన్, కార్యదర్శిగా కేవి రమణయ్య, అదనపు కార్యదర్శిగా శ్రీలత అలాగే మెట్‌పల్లి డివిజన్ అధ్యక్షునిగా లక్ష్మణ్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా రవీంధర్, కార్యదర్శిగా లక్కం సురేష్, అదనపు కార్యదర్శి వేణుగోపాల్, సిటి సర్కిల్ అధ్యక్షునిగా రాజేంధర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షునిగా శరత్‌బాబు, కార్యదర్శిగా నాగరాజు, అదనపు కార్యదర్శి రాజేంధర్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

'తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియాగాంధీ'

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియాగాంధీ అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంల ఏఐసీసీ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ సోనియా గాంధీ పేరట జన్మదిన కేక్‌ను కట్ చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంపిణీ చేసి ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, వెలగటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అప్పం తిరుపతి, బొల్లారపు పోచయ్య, ఎండీ రఫియొద్దీన్, ఎండీ షబ్బీర్, ఆశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్మపురిలో కేక్‌కట్ చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

●**జగిత్యాల అర్బన్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరా భవన్‌లో జరిగిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, తాటిపర్తి విజయలక్ష్మీ, బండ శంకర్, కొత్త మోహన్, అనుమల్ల జయశ్రీ, కంటాల శ్రీనివాస్, కండ్లపెల్లి దుర్గయ్య, బాగోజి ముఖేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ శీలం వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, వేంకటేశ్వర దేవాలయ చైర్మెన్ ఎతిరాజం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** సోనియా గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్టణ మైనారిటీ సెంట్రల్ కమిటీ మాజీ అధ్యక్షుడు వకీల్ పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లింగం, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, యామ రాజయ్య, ముఖీమ్, బర్ల వంశీ, ఖాజా అజీమ్, గజ రాజారెడ్డి, ఎల్లేష్, పుల్లరాజాగౌడ్, పాపేష్, జాఖీర్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్/భీమారం/కథలాపూర్/మల్లాపూర్/కొడిమ్యాల/పెగడపల్లి:** ఆయా మండలకేంద్రాల్లో, గ్రామాల్లో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వేడుకలు నిర్వహించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

రాయికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన తాటిపాముల దేవక్క (82) అనే వృద్ధురాలు మంగళవారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం దేవక్క గత కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి సరిగా లేక బాధ పడుతుందన్నారు. జీవితంపై విరక్తి చెంది ఇంటి ఎదుట గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొ న్నారు. దేవక్క కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయికల్ ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దు

జగిత్యాల టౌన్, డిసెంబరు 09(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ ప్రజలు ఇంటి నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని, మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని 21వ వార్డులో రూ.15 లక్షలతో, 4వ వార్డులో రూ. 4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ మోతే, చింతకుంట చెరువు పునరుద్దరణకు ఒక్కో చెరువుకు రూ. 3.5 కోట్లు మంజూరి చేశామని అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడంతోనే నేడు రాష్ట్రంలో అత్యధిక నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నందయ్య, మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజి మున్సిపల్ చైర్మన్‌లు గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నాగారం గ్రామానికి చెందిన మేడిశెట్టి తిరుపతి (38) అనే వ్యక్తి మానసిక స్థితి బాగులేక ఉరివేసుకొని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి ఎస్ఐ జి. మహేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు తిరుపతికి గత ఐదు సంవత్సరాల నుంచి మానసిక స్థితి బాగలేక బాధపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. చలికాలం రాగానే పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూ తిరుగుతూ అరుస్తుంటాడని ఆయన తెలిపారు. గతంలో కూడా మూడు సార్లు ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు ఆయన వివరించారు. ఈ రోజు కూడ పిచ్చి పిచ్చిగా ప్రవర్తించి ఇంటి నుండి బయటకు వెళ్లి గ్రామ శివారులో గల డంపింగ్ యార్డులో నైలాన్ తాడుతో ఇనుప దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. తిరుపతికి మానసిక స్థితి బాగులేనంన జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవ పంచనామ జరిపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● సంక్షిప్తం..

●జగిత్యాల అర్బన్: గ్రామ పంచాయతీలకు జరిగే ఎన్నికలు శాంతియుతంగా జరుపుకోవాలని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలంలో పోలీసులు కవాతు నిర్వహించారు.

●కొడిమ్యాల: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించు కోవాలని మల్యాల సీఐ నీలం రవి కోరారు. మండల కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

●గొల్లపల్లి: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.